అర్హులందరికీ సంక్షేమ ఫలాలు



అల్లిపూడిలో లబ్ధిదారులకు సర్టిఫికెట్లు అందిస్తున్న మంత్రి దాడిశెట్టి రాజా



గెద్దనాపల్లిలో లబ్ధిదారులకు సర్టిఫికెట్లు అందజేస్తున్న ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు



రౌతులపూడిలో లబ్ధిదారులకు ధ్రువీకరణ పత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్రప్రసాద్

- రాష్ట్ర రోడ్లు, భవనాలశాఖ మంత్రి దాడిశెట్టి రాజా
- గ్రామాల్లో ఉత్సాహంగా 'జగనన్న సురక్ష'

కోటనందూరు: అర్హత కలిగిన ప్రతిఒక్కరికీ సంక్షేమ ఫలాలు అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం జగనన్న సురక్షా కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందని రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి దాడిశెట్టి రాజా అన్నారు. బుధవారం అల్లిపూడిలో జరిగిన జగనన్న సురక్ష కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం పని చేస్తోందన్నారు. దీనిలో భాగంగా ప్రతీ ఇంటిని జల్లెడ పట్టి పథకాలు పొందడానికి అవసరమైన ధ్రువపత్రాలను ఉచితంగా అందజేస్తున్నారన్నారు. ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా తీసుకొచ్చిన ఈ కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం లబ్ధిదారులకు సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు నల్లమిల్లి గోవిందు, గర్సింగు దొరబాబు, రుత్త జోగిరాజు, చింతకాయల చిట్టిబాబు, కొరుప్రోలు కృష్ణ, కురందాసు రాంబాబు, ఉల్లూరి శ్రీను, తహసీల్దార్ జగదీష్, ఎంపీడీఓ సుబ్రహ్మణ్యశర్మ, ఈఓపీఆర్డీ అరుణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికే 'జగనన్న సురక్ష'

రౌతులపూడి: ప్రజా సమస్యల పరిష్కారం కోసమే ప్రభుత్వం 'జగనన్న సురక్ష' కార్యక్రమాన్ని ప్రవేశపెట్టిందని ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్రప్రసాద్ తెలిపారు. రౌతులపూడి సచివాలయం వద్ద బుధవారం జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తోందన్నారు. గ్రామాల్లో వివిధ ధ్రువీకరణ పత్రాలు అందని కారణంగా సంక్షేమ పథకాలు నిలిచిపోయిన లబ్ధిదారులను జగనన్న సురక్ష కార్యక్రమంలో గుర్తించి వారికి సంక్షేమ పథకాలు అందిస్తున్నట్టు తెలిపారు. ప్రజలు జగనన్న సురక్షను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనంతరం లబ్ధిదారులకు సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో ప్రత్తిపాడు మార్కెట్ కమిటీ చైర్మన్ జిగిరెడ్డి రమణమ్మ, మండల వ్యవసాయ సలహా కమిటీ చైర్మన్ వాసిరెడ్డి భాస్కర బాబు, డీసీసీబీ డైరెక్టర్ పులి మధు, ఆసుపత్రి అభివృద్ధి కమిటీ చైర్మన్ కై సర్ల సత్యనారాయణ, వైఎస్సార్ సీపీ నాయకుడు రామకుర్తి బాబ్జి, తహసీల్దార్ బి.భీమారావు, డీటీ పీవీవీ సత్యనారాయణ, ఈఓపీఆర్‌డీ వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

ప్రత్తిపాడు: మండలంలోని పెదశంకర్లపూడి సచివాలయం వద్ద బుధవారం నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమంలో ఎమ్మెల్యే పర్వత పూర్ణ చంద్రప్రసాద్ పాల్గొన్నారు. లబ్ధిదారులకు రైస్ కార్డులు, కౌలు రైతు గుర్తింపు కార్డులు, మ్యుటేషన్, ఆదాయ, కుల ధృవీకరణ పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ఎంవీఆర్ కుమార్ బాబు, తహసీల్దార్ పీవీవీ గోపాలకృష్ణ, ఎంపీపీ గోళ్ల కాంతి సుధాకర్, అన్నవరం దేవస్థానం ట్రస్ట్‌బోర్డు సభ్యుడు దోశి చిట్టిబాబు, రామిశెట్టి చినబాబు, లంపకలోవ సొసైటీ చైర్మన్ గొంతిన సురేష్, మండల కోఆప్షన్ సభ్యుడు గంటా మహాలక్ష్మీరావు తదితరులు పాల్గొన్నారు.

సురక్షతో సమస్యలకు శాశ్వత పరిష్కారం

కిర్లంపూడి: జగనన్న సురక్ష కార్యక్రమంతో ప్రజల సమస్యలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు అన్నారు. గెద్దనాపల్లి సచివాలయం-1లో బుధవారం జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే చంటిబాబు మాట్లాడుతూ గతంలో ప్రజలు ప్రభుత్వ సేవలు పొందేందుకు కాళ్లు అరిగేలా ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరిగే పరిస్థితి ఉండేదన్నారు. ప్రస్తుతం ప్రభుత్వ సేవలు ప్రజల వద్దకే చేరుతున్నాయన్నారు. ప్రజా సంక్షేమమే లక్ష్యంగా పని చేస్తున్న వైఎస్సార్ సీపీ ప్రభుత్వాన్ని మరోసారి అధికారంలోకి తీసుకురావాలని ప్రజలను కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ తోట రవి, సర్పంచ్ మొల్లేటి గంగాభవానీ, తోట గాంధీ, దోమాల గంగాధర్, జనపరెడ్డి బాబు, భూపాలపట్నం ప్రసాద్, పెట్లు శ్రీనివాస్, బొడ్డేటి గోవిందు, మండల ప్రత్యేకాధికారి దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

జగ్గంపేట: మండలంలోని రాజపూడిలో బుధవారం నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమంలో ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు పాల్గొన్నారు. పలువురు లబ్ధిదారులకు సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీపీ అత్తులూరి నాగబాబు, రాష్ట్ర వైఎస్సార్ సీపీ సేవాదళ్ కార్యదర్శి ఒమ్మి రఘురాం, గ్రామ సర్పంచి బూసాల విష్ణు, వైఎస్సార్ సీపీ నేతలు ముమ్మన సోమరాజు, కృష్ణార్జున తదితరులు పాల్గొన్నారు.

సద్వినియోగం చేసుకోండి

గండేపల్లి: జగనన్న సురక్ష కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు సూచించారు. మండలంలోని జెడ్.రాగంపేటలో బుధవారం నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. వివిధ సర్టిఫికెట్ల కోసం దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులకు ధ్రువపత్రాలు అందజేశారు. ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీపీ చలగళ్ల దొరబాబు, వైస్ ఎంపీపీ కుంచె రాజా, వైఎస్సార్ సీపీ మండలాధ్యక్షుడు కందుల చిట్టిబాబు, ఏఎంసీ చైర్మన్ జనపరెడ్డి బాబు, ఎంపీటీసీ నూకరాజు, ఉప్పలపాడు సర్పంచ్ అడబాల ఆంజనేయులు, గండేపల్లి సొసైటీ మాజీ అధ్యక్షుడు పరిమి బాబు తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు మేలు

అన్నవరం: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా ప్రజలకు ఎంతో మేలు చేకూరుతుందని అన్నవరం గ్రామ సర్పంచ్ శెట్టిబత్తుల కుమారరాజా అన్నారు. స్థానిక పంచాయతీ కార్యాలయంలో బుధవారం జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. శంఖవరం తహసీల్దార్ సుబ్రహ్మణ్యం, గ్రామ కార్యదర్శి జేవీఎస్ రామకృష్ణ తదితరులు ప్రసంగించారు. అనంతరం 232 మంది లబ్ధిదారులకు వివిధ సర్టిఫికెట్లు అందజేశారు.



తునిలో లబ్ధిదారులకు ధ్రువపత్రాలను పంపిణీ చేస్తున్న ఏలూరి బాలు, మున్సిపల్ కమిషనర్



అన్నవరంలో మహిళకు సర్టిఫికెట్ అందజేస్తున్న నాయకులు



పెదశంకర్లపూడిలో వృద్ధురాలికి రైస్ కార్డు అందిస్తున్న ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్ర ప్రసాద్

సమస్యలకు సత్వర పరిష్కారం

తుని: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్న సురక్ష కార్యక్రమంతో సమస్యలకు సత్వర పరిష్కారం లభిస్తుందని వైఎస్సార్ సీపీ యువజన విభాగం తుని నియోజకవర్గ అధ్యక్షుడు ఏలూరి బాలు అన్నారు. పట్టణంలోని 3వ సచివాలయంలో బుధవారం మున్సిపల్ కమిషనర్ ప్రసాదరాజు ఆధ్వర్యంలో నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. దరఖాస్తుదారులకు ధ్రువపత్రాలను అందజేశారు. మున్సిపల్ వైస్ చైర్మన్ పామర్తి మహేష్, వైఎస్సార్ సీపీ తుని పట్టణశాఖ అధ్యక్షుడు రేలంగి రమణాగౌడ్, జిల్లా వక్ఫ్‌బోర్డు వైస్ చైర్మన్ షేక్ ఖ్వాజా, కౌన్సిలర్లు మర్రా సత్యవతి, సూరిశెట్టి సుభద్రాదేవి పాల్గొన్నారు.

క్లుప్తంగా

నేడు బూరుగుపూడిలో గడపగడపకూ మన ప్రభుత్వం

కిర్లంపూడి: మండల పరిధిలోని బూరుగుపూడిలో గురువారం గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నట్టు ఎంపీపీ తోట రవి బుధవారం తెలిపారు. ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు గ్రామంలో ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలు తెలుసుకుంటారన్నారు. వైఎస్సార్ సీపీ నాయకులు, అధికారులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

నేడు మండల సమావేశం

ఏలేశ్వరం: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్టు ఎంపీడీఓ ప్రేమ్‌సాగర్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఎంపీపీ గొల్లపల్లి బుజ్జి అధ్యక్షతన ఉదయం 10:30 గంటలకు జరిగే సమావేశానికి అధికారులు, ప్రజాప్రతినిధులు తప్పక హాజరుకావాలని ఆయన కోరారు.

చిన్నారులకు ఫిజియోథెరపీ సేవలు



చిన్నారితో వ్యాయామం చేయిస్తున్న ఫిజియోథెరపిస్టు సోమేశ్వరరావు

కోటనందూరు: స్థానిక నాన్‌భవిత కేంద్రంలో దివ్యాంగ చిన్నారులకు బుధవారం ఫిజియోథెరపీ సేవలు అందించారు. ఫిజియోథెరపిస్టు టీఎస్ఎస్ సోమేశ్వరరావు చిన్నారులతో వ్యాయామాలు చేయించారు. వాతావరణ మార్పుల కారణంగా చిన్నారులకు వచ్చే రోగాలపై తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. సీజన్ ముగిసే వరకూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమాన్ని ఎంఈఓ శ్రీనివాస్ పరిశీలించారు. ప్రతి బుధవారం ఉచితంగా అందించే ఫిజియోథెరపీ సేవలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఐఈఆర్పీలు ఎం.నాగగోవిందు, ఆర్. నారాయణరావు పాల్గొన్నారు.

నేడు మంత్రి రాజా పర్యటన

తుని: రాష్ట్ర రోడ్లు, భవనాలశాఖ మంత్రి దాడిశెట్టి రాజా గురువారం తుని పట్టణం అమ్మాజీపేటలో పర్యటిస్తారని వైఎస్సార్ సీపీ యువజన విభాగం అధ్యక్షుడు ఏలూరి బాలు బుధవారం తెలిపారు. అమ్మాజీపేట 4వ సచివాలయం వద్ద జగనన్న సురక్ష కార్యక్రమానికి హాజరవుతారన్నారు. అధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

విజేతలకు బహుమతుల ప్రదానం



విజేతలను అభినందిస్తున్న అధ్యాపకులు

గండేపల్లి: విద్యార్థులు చదువుతో పాటు క్రీడలకు ప్రాధాన్యం ఇవ్వాలని ఆదిత్య కళాశాలల ప్రిన్సిపాల్ డోల సంజయ్ సూచించారు. మండలంలోని సూరంపాలెం ఆదిత్య ఇంజినీరింగ్ కళాశాలలో నిర్వహించిన అంతర్గత క్రీడా పోటీలు ముగిశాయి. వివిధ క్రీడల్లో విజేతలకు బుధవారం బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో కళాశాల డీన్ ఎ.రామకృష్ణ, అడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్ పి.వేణుగోపాల్, ఫిజికల్ డైరెక్టర్ బి.ఆదిత్య, ఎన్.గంగాధర్, వివిధ విభాగాల అధిపతులు పాల్గొన్నారు.

పాఠశాల తనిఖీ

శంఖవరం/రౌతులపూడి: శంఖవరంలోని ఆదర్శ పాఠశాలను బుధవారం ఎంఈఓ-2 గోవిందు ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులను తనిఖీ చేసి సిబ్బందికి పలు సూచనలు చేశారు. అనంతరం పాఠశాలలో జరుగుతున్న నాడు-నేడు పనులను పరిశీలించారు. పనులు వేగవంతం చేయాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. విద్యార్థుల వసతి గృహాన్ని సందర్శించి పాఠశాల ప్రిన్సిపాల్ క్రిష్ణవేణికి పలు సూచనలు చేశారు.

ఆధ్యాత్మిక వేత్త శ్యాంప్రసాద్‌కు సత్కారం



చిన శంకర్లపూడిలో శ్యాం ప్రసాద్‌ను సత్కరిస్తున్న సగర సంఘం నాయకులు

ప్రత్తిపాడు: ప్రముఖ ఆధ్యాత్మిక ప్రచారకుడు, రేడియో, టీవీ గాయకుడు విభూతి శ్యాంప్రసాద్ సేవలు ఎనలేనివని పలువురు వక్తలు కొనియాడారు. మండలంలోని చిన శంకర్లపూడి సగర రామాలయం వద్ద బుధవారం జిల్లా సగర సంక్షేమ సంఘం మాజీ అధ్యక్షుడు ఏపూరి సత్యనారాయణ ఆధ్వర్యంలో శ్యాంప్రసాద్‌ను శాలువా, పూలమాలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా నియోజకవర్గ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఏపూరి శ్రీనివాసరావు మాట్లాడుతూ గత వారం రోజులుగా శ్యాంప్రసాద్ ఆలయాల్లో ఆధ్యాత్మిక ప్రచనాలు చేస్తున్నారన్నారు. కళాకారులను ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో చనిబోయిన బుజ్జి, ఏపూరి రాంబాబు, రాసనబోయిన బుచ్చియ్య, పసుపులేటి రాఘవ, గోళ్ళ వాసుబాబు, పొట్రు శివ తదితరులు పాల్గొన్నారు.

అన్ని వర్గాలకూ సంక్షేమ పథకాలు



రామవరంలో మహిళకు ప్రభుత్వ పథకాలు వివరిస్తున్న ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు

జగ్గంపేట: పార్టీలకు అతీతంగా రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజలకూ సంక్షేమ పథకాలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు అన్నారు. మండలంలోని రామవరంలో బుధవారం ఆయన గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. అధికారులు, ప్రజాప్రతినిధులతో కలిసి గ్రామంలోని ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలు తెలుసుకున్నారు. గత నాలుగేళ్లుగా ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. గ్రామస్తులు మురుగు కాలవలు, రోడ్లు, వీధిదీపాలు తదితర సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా ఆయా సమస్యలను తక్షణమే పరిష్కరించాలని అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు. కార్యక్రమంలో పలువురు వైఎస్సార్ సీపీ నేతలు పాల్గొన్నారు.

జీవామృతం తయారీపై రైతులకు శిక్షణ



ఏలేశ్వరంలో జీవామృతం తయారీపై శిక్షణ ఇస్తున్న ఏఓ జ్యోతి

ఏలేశ్వరం: విత్తన శుద్ధితో అధిక దిగుబడులు సాధించవచ్చని మండల వ్యవసాయాధికారి బి.జ్యోతి అన్నారు. పట్టణంలోని రైతులకు బుధవారం జీవామృతం తయారీపై శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విత్తన శుద్ధి చేయడం ద్వారా మొక్క ఆరోగ్యంగా పెరిగి అధిక దిగుబడి వస్తుందన్నారు. రైతులు సుడోమోనస్ పౌడర్‌ను కేజీ విత్తనాలకు 8 గ్రాముల చొప్పున కలిపి రెండు గంటల పాటు ఆరబెట్టి నాటుకోవాలన్నారు. దీని ద్వారా నేల నుంచి సంక్రమించే మాగుడు, పొడతెగులు, అగ్గితెగులు, దుబ్బుకుళ్లు, ఆకుఎండు తెగుళ్లను నివారించవచ్చన్నారు. ప్రకృతి వ్యవసాయంతో కలిగే ప్రయోజనాలను వివరించారు. కార్యక్రమంలో ఎంపీఈఓ దివ్య, ప్రకృతి వ్యవసాయ మాస్టర్ ట్రైనర్ మజ్జి నాగేశ్వరరావు, రైతులు ముద్రగడ ప్రసాద్, బంక శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

క్రైస్తవుల సంక్షేమానికి కృషి



సమావేశంలో మాట్లాడుతున్న రీజనల్ కార్యదర్శి డేవిడ్ మనోహర్

ఏలేశ్వరం: క్రైస్తవుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తోందని వైఎస్సార్ సీపీ క్రిస్టియన్ మైనార్టీ సెల్ రీజనల్ కార్యదర్శి పట్టెం డేవిడ్ మనోహర్ అన్నారు. స్థానిక క్వారీ ప్రాంతంలోని ప్రార్థన మందిరంలో బుధవారం ఆంధ్రప్రదేశ్ ఇండిపెండెంట్ పాస్టర్స్ బిషప్ కౌన్సిల్ కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డేవిడ్ మనోహర్ మాట్లాడుతూ క్రీస్తు బోధనలు చేస్తున్న తమపై మతమార్పిడి పేరుతో దాడులు చేస్తున్నారన్నారు. దాడులకు వ్యతిరేకంగా కౌన్సిల్ అండగా ఉంటుందన్నారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి క్రైస్తవుల సంక్షేమానికి అనేక పథకాలు ప్రవేశపెట్టారన్నారు. పాస్టర్లకు నెలకు రూ.5 వేల గౌరవ వేతనంతో పాటు వారి సంక్షేమానికి కృషి చేస్తున్నారన్నారు. కౌన్సిల్ కాకినాడ జిల్లా రీజినల్ చైర్మన్ జాన్‌వెస్లీ మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాలను క్రైస్తవులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. పాస్టర్లు గౌరవ వేతనానికి దరాఖాస్తు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కౌన్సిల్ రాష్ట్ర కార్యదర్శి అడపా నాగ మోహనరావు, జిల్లా అధ్యక్షుడు సైలస్, కుంపట్ల ప్రసాద్, ఇషాక్, ఏబీవీ ప్రసాద్, ప్రభుకుమార్, తదితరులు పాల్గొన్నారు.

గ్రామ స్వరాజ్యం సీఎం జగన్‌తోనే సాధ్యం

- రాష్ట్ర రోడ్లు, భవనాలశాఖ మంత్రి దాడిశెట్టి రాజా
- పైడికొండ, ఆనూరులో నూతన సచివాలయ భవనాల ప్రారంభం



ఆనూరులో గ్రామ సచివాలయ భవనాన్ని ప్రారంభించిన మంత్రి దాడిశెట్టి రాజా

తొండంగి: జాతిపిత మహాత్మా గాంధీజీ కలలుగన్న గ్రామ స్వరాజ్యాన్ని సచివాలయ వ్యవస్థ ద్వారా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సాధించారని రాష్ట్ర రోడ్లు, భవనాలశాఖ మంత్రి దాడిశెట్టి రాజా అన్నారు. మండలంలోని పైడికొండ, ఆనూరు గ్రామాల్లో గ్రామ సచివాలయ నూతన భవనాలను బుధవారం మంత్రి రాజా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వాతంత్ర్యం వచ్చిన 70 ఏళ్లలో గత ప్రభుత్వాలు సాధించని గ్రామ స్వరాజ్యాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సచివాలయ, వలంటీర్ వ్యవస్థల ద్వారా సాధించారన్నారు. దీంతో ప్రజల వద్దకే పాలన అందిస్తున్నారన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా నవరత్న పథకాలను అమలు చేస్తున్నారన్నారు. అనంతరం స్థానిక ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. జల జీవన్ మిషన్ పథకంలో ప్రతి ఇంటికీ కుళాయి కనెక్షన్ ఇచ్చి రక్షిత తాగునీరు అందిస్తామన్నారు. ఇప్పటికే దీనికి సంబంధించిన వాటర్ ట్యాంకుల నిర్మాణాలు పూర్తయినట్టు వివరించారు. కార్యక్రమంలో తుని వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ మాకినీడి బాబు, మాజీ చైర్మన్ కొయ్యా మురళి, వైస్ ఎంపీపీ నాగం గంగబాబు, పార్టీ నాయకులు గాబు రాజు, మేరుగు ఆనందహరి, తహసీల్దార్ బి.సుబ్రహ్మణ్యం, ఎంపీడీఓ పసపులేటి సతీష్, సర్పంచ్ నరిశే నాగదుర్గ, నరిశే వీరస్వామి (తాతయ్యలు), మేడిశెట్టి దారబాబు, కాశిందేవులు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామ సచివాలయం ప్రారంభం

కోటనందూరు: మండలంలోని ఎస్సార్‌పేటలో రూ.40 లక్షలతో నూతనంగా నిర్మించిన గ్రామ సచివాలయాన్ని మంత్రి దాడిశెట్టి రాజా ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి గ్రామ సచివాలయం, వలంటీర్ వ్యవస్థలతో ప్రభుత్వ సేవలను ప్రజల ముంగిటకు చేర్చారన్నారు. గ్రామ స్వరాజ్యం దిశగా రాష్ట్ర ప్రభుత్వం అడుగులేస్తుందన్నారు. సచివాలయ సిబ్బంది ప్రజలకు మెరుగైన సేవలందించాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీపీ లగుడు శ్రీనివాసు, వ్యవసాయ సలహామండలి రాష్ట్ర డైరెక్టర్ లంక ప్రసాద్, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ చింతకాయల చినబాబు, సొసైటీ చైర్మన్ గొర్లి రామచంద్రరావు, తుని ఎంఎసీ చైర్మన్ మాకినీడు బాబు, వైస్ చైర్మన్ వెలగా వెంకటకృష్ణాజీ, సర్పంచులు రుత్తల రాజేశ్వరి, తరిపే చినతల్లి, సుర్ల రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

కాలువలకు జలకళ



గోకవరం శివారున పంట కాలువలో ఉధృతంగా ప్రవహిస్తున్న నీరు

గోకవరం: స్థానిక ఊరకాలువ, బురదకాలువ, పంట కాలువలు బుధవారం వరద నీటితో కళకళలాడాయి. మంగళవారం రాత్రి మండలంతో పాటు ఏజెన్సీలో కురిసిన భారీ వర్షానికి కాలువల్లో నీరు ప్రవహించింది. గోకవరం శివారున దేవీపట్నం ఆర్‌అండ్‌ఆర్ కాలనీకి వెళ్లే మార్గంలో పంట కాలువ సప్టా పైనుంచి ఉధృతంగా నీరు ప్రవహించడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. అలాగే పంట కాలువ పొంగడంతో సమీపంలోని నారుమడులు నీటమునిగాయి.

మోసగించిన వ్యక్తికి జైలు శిక్ష

పిఠాపురం: ఉద్యోగం ఇప్పిస్తానని నమ్మించి మోసం చేసిన వ్యక్తికి 6 నెలల జైలు శిక్ష రూ.10 వేల జరిమానా విధిస్తూ పిఠాపురం అదనపు జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ ఎంఎల్ సాయిసుభాష్ బుధవారం తీర్పు చెప్పారు. వివరాల్లోకి వెళితే.. పిఠాపురం మండలం విరవకు చెందిన సింగినీడి దివ్యరుషి ఆశా వర్కర్ ఉద్యోగం కోసం కాకినాడ వైద్యారోగ్య శాఖ కార్యాయంలో దరఖాస్తు చేసుకుంది. విషయం తెలుసుకున్న విజయనగరం జిల్లా జొన్నాడ చింతల వలసకు చెందిన దొప్పా రవికుమార్ ఆమెకు ఉద్యోగం ఇప్పిస్తానని నమ్మించాడు. ఉద్యోగం కావాలంటే కొంత సొమ్ము ముట్టజెప్పాలని కోరాడు. దీంతో ఆమె అతనికి రూ.60 వేలు ఇచ్చింది. డబ్బు తీసుకుని ఏళ్లు గడుస్తున్నా ఉద్యోగం రాక పోయే సరికి అతడిని అడగడానికి ప్రయత్నించగా అందుబాటులో లేకుండా పోయాడు. దీంతో తాను మోసపోయానని గ్రహించిన ఆమె పిఠాపురం రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీనిపై కేసు నమోదు చేసిన పిఠాపురం రూరల్ ఎస్సై అబ్దుల్ నబీ నిందితుడిని అరెస్టు చేసి కోర్టులో హాజరుపర్చారు. వాదోపవాదాల అనంతరం నిందితుడిపై నేరం రుజువు కావడంతో 6 నెలల జైలు శిక్ష రూ.10 వేల జరిమానా విధిస్తూ పిఠాపురం అదనపు జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ ఎంఎల్ సాయి సుభాష్ తీర్పు చెప్పారు. జరిమానా కట్టలేని పక్షంలో మరో రెండు నెలలు జైలు శిక్ష అనుభవించాలని న్యాయమూర్తి తన తీర్పులో పేర్కొన్నారు.

నేడు చింతలూరులో వామపక్ష నేతల పర్యటన

ప్రత్తిపాడు: మండలం చింతలూరులో గురువారం వామపక్ష నాయకులు, వివిధ ప్రజా సంఘాల నాయకులు పర్యటిస్తారని సీపీఐ (ఎంఎల్) లిబరేషన్ కేంద్ర కమిటీ సభ్యుడు బుగత బంగార్రాజు తెలిపారు. గ్రామంలోని ఈనాం భూములకు పట్టాల మంజూరు విషయమై గ్రామంలో పర్యటించి, రైతులతో సమావేశం నిర్వహిస్తారని చెప్పారు.

వృక్ష విలాపం

- సర్వీస్ రోడ్డు నిర్మాణం పేరుతో వృక్షాల నరికివేత
- పంచాయతీ అనుమతి లేదంటూ సర్పంచ్ అభ్యంతరం



సత్యదేవ జూనియర్ కళాశాల వెలుపల నరికేసిన చెట్లు

అన్నవరం: స్థానిక జూనియర్ కళాశాలకు ముందు ఆర్‌అండ్‌బీ రోడ్డులోని పెద్ద పెద్ద వృక్షాలను సర్వీస్ రోడ్డు నిర్మాణం పేరుతో తొలగించడం బాధాకరమని అన్నవరం గ్రామ సర్పంచ్ శెట్టిబత్తుల కుమార్ రాజా అన్నారు. గ్రామ పంచాయతీ అనుమతి లేకుండా వృక్షాలను తొలగించడంపై బుధవారం ఆయన అభ్యంతరం వ్యక్తం చేశారు. రత్నగిరిపై వివిధ నిర్మాణాలకు గాను పంచాయతీకి ఆస్తి పన్ను చెల్లించాల్సి ఉండగా దీనిపై పంచాయతీ హైకోర్టును ఆశ్రయించిందన్నారు. దేవస్థానం ధార్మిక సంస్థ అయినందున పంచాయతీకి ఎటువంటి పన్నులు చెల్లించనవసరం లేదని హైకోర్టు స్టే ఇవ్వడంతో ఎటువంటి పన్నులు చెల్లించడం లేదని తెలిపారు. ఇప్పుడు కొండదిగువన ఆర్ అండ్ బీ స్థలంలో వృక్షాలను పంచాయతీకి తెలియజేయకుండా ఎలా తొగిస్తారని ప్రశ్నించారు. పంచాయతీ చట్టం ప్రకారం కొత్తగా వేసే సర్వీస్ రోడ్డుపై వాహనాలు నిలిపివేస్తే పంచాయతీకి ఆశీలు వసూలు చేసే హక్కు ఉంటుందన్నారు. దేవస్థానం అధికారులు భక్తులకు కల్పించే సౌకర్యాలకు, నిర్మాణాలకు తాము వ్యతిరేకం కాదని, కాకపోతే ఏకపక్షంగా వ్యవహరించడం సరికాదన్నారు. దీనిపై దేవస్థానం ఇంజినీరింగ్ అధికారులను వివరణ కోరగా కళాశాల వెలుపల స్థలంలో సర్వీస్ రోడ్డు నిర్మాణానికి అనుమతి ఇవ్వాలని ఆర్ అండ్‌బీ అధికారులకు లేఖ రాశామన్నారు. త్వరగా పనులు ప్రారంభిస్తామని, ఈ లోపు చెట్లను తొలగించి చదును చేస్తున్నామని తెలిపారు.



సర్వీస్ రోడ్డు నిర్మాణం కోసం స్థలాన్ని చదును చేస్తున్న దృశ్యం